## క్లుప్తంగా

### వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో ఆదివారం సీపీఐఎంఎల్ ఐక్యత మహాసభల కార్యక్రమ వాల్ పోస్టర్లను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దేవరాం మాట్లాడుతూ.. దేశ చరిత్రలో కమ్యూనిస్టు పార్టీలు విలీనం కావడం హర్షించదగ్గ విషయమన్నారు. వచ్చే నెల 3నుంచి 5వరకు జరిగే సీపీఐఎంఎల్ ఐక్యత(విలీన)మహాసభలకు ప్రజలందరు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. నాయకులు తలారి గంగాధర్, గంగన్న, అనిల్‌కుమార్, ప్రణయ్, వర్షిత్, నిఖిల్, కార్మికులు పాల్గొన్నారు.

### అయోధ్యకు తరలిన ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు



సుభాష్‌నగర్: నగరంలోని రైల్వే స్టేషన్ నుంచి పలువురు ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు ఆదివారం అయోధ్యకు బయలుదేరారు. అయోధ్యలోని బాలరాముడిని ప్రతి ఒక్క హిందువు దర్శించుకోవాలని జిల్లా సంయోజకులు సుదర్శన్ పేర్కొన్నారు. నగర సంఘ్ చాలక్ శ్రీనివాస్, వీహెచ్‌పీ పూర్వ కార్యదర్శి వైట్ల సుబ్బారావు, కార్యదర్శి అబ్బన్న, మధుసూదన్ తదితరులు ఉన్నారు.

### భాగ్యరెడ్డివర్మ వర్ధంతి

వేల్పూర్: రామన్నపేట్‌లో ఆదివారం అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో భాగ్యరెడ్డివర్మ 85వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళితుల అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారని వారు కొనియాడారు. రణధీర్, సుమన్, తిరుపతి, వినోద్, బాబూరావు, రంజిత్ పాల్గొన్నారు.

### ఆట వస్తువుల వితరణ



వేల్పూర్: కుకునూర్ ప్రైమరీ స్కూలుకు ఎజిలిటి అనే ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ ఆట వస్తువులను వితరణ చేసింది. వితరణ చేసిన పరికరాలను ఆదివారం ప్రారంభించారు. ఐదేళ్ల కింద ఎజిలిటి సంస్థ కుకునూర్ హైస్కూలు, ప్రైమరీ స్కూలును దత్తత తీసుకొని స్కూళ్లకు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా ఆట వస్తువులను సమకూర్చారు. ఎజిలిటి సంస్థ ప్రతినిధులు నరేశ్, మనోహర్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు, హెచ్‌ఎం నరేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

### శిక్షణకు తరలిన రైతులు



డొంకేశ్వర్(ఆర్మూర్): హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ కాలేజీలో ఆదివారం నిర్వహించిన అగ్రిటెక్ సౌత్–2024 కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి 53 మంది రైతులు తరలివెళ్లారు. శిక్షణ నిమిత్తం చేపట్టిన ఈ విజ్ఞాన యాత్రను వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) పీడీ తిరుమల ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. అగ్రిటెక్ సౌత్ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు పంటల సాగులో నూతన విధానాలను, యాంత్రీకరణపై అవగాహన పొందారు. వీరి వెంట ఆత్మ అధికారులు ఉన్నారు.

### నూతన వీడీసీ కార్యవర్గం ఎన్నిక

బాల్కొండ: బాల్కొండ మండలం కిసాన్‌నగర్(దుబ్బా) నూతన వీడీసీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తమ్మె కపిల్, ఉపాధ్యక్షుడిగా బొంత రాములు, కోశాధికారిగా జక్క రాజలింగం, ప్రధాన కార్యదర్శిగా గడ్డం యాదగిరి, కార్యదర్శిగా పోశెట్టి, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని ప్రమాణం చేశారు.

### పిల్లలకు సన్మార్గంపై అవగాహన కల్పించాలి

రుద్రూర్: చిన్న వయస్సులో పిల్లలకు అల్లా చూపిన సన్మార్గంపై అవగాహన కల్పించాలని మరియం మజీద్ సదర్ మమ్మద్ ఇమ్రాన్ ఖాద్రి అన్నారు. రుద్రూర్‌లో మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం బాలబాలికలకు నాత్, తక్రిర్‌లపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇస్లాం గురించి వివరించారు. పిల్లలకు చిన్నతనంలోనే అవగాహన కల్పించినట్లయితే ప్రేమ, కరుణ, దయలతో జీవనం సాగిస్తారని, తద్వారా ప్రపంచ శాంతి నెలకొంటుందని అన్నారు. మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షర్ఫుద్దీన్, సయ్యద్ ముల్తాని, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

# ఆస్తి పన్ను కట్టేదేలే?

సామాన్యులు ఆస్తిపన్ను కట్టకుంటే మున్సిపల్ అధికారులు నానా హంగామా చేస్తారు. కానీ నగరంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు ఏళ్ల తరబడి ఆస్తిపన్ను కట్టకున్నా.. ఆ వైపుకు మాత్రం వెళ్లరు. ఎందుకంటే ప్రభుత్వ శాఖల్లో మున్సిపల్ కూడా ఒకటి కదా. అయినా ఆయా శాఖలకు ప్రభుత్వం ప్రతి ఏడాది నిధులు ఇస్తూనే ఉంది. అధికారులు మాత్రం మున్సిపాలిటీకి కట్టాల్సిన ఆస్తి పన్ను మాత్రం కట్టడం లేదు. దీంతో నగర మున్సిపల్ కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన ఆయా శాఖల బకాయిలు రూ.కోట్లల్లో పేరుకుపోయాయి.

- మొండికేస్తున్న ప్రభుత్వ శాఖలు
- నోటీసులు ఇచ్చినా పట్టించుకోరు
- మున్సిపాలిటీని వేధిస్తున్న పన్ను బకాయిలు




నిజామాబాద్‌నాగారం: నగరంలో ఉంటున్న పౌరులందరూ ప్రతియేటా మున్సిపల్ కార్పొరేషన్‌కు ఆస్తి పన్ను కడుతుంటారు. నగరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉన్నాయి. దీంతో ఆయా శాఖల భవనాల అధికారులు ప్రతి ఏడాది ఖచ్చితంగా ఆస్తి పన్ను అందరిలాగే చెల్లించాల్సి ఉంటుంది. సామాన్యులు ఒకవేళ పన్ను సకాలంలో కట్టకుంటే అధికారులు తగిన చర్యలు తీసుకుంటా రు. కానీ ప్రభుత్వశాఖల విషయంలో అధికారులు చేసేది లేక చేతులెత్తేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దాలుగా పన్ను చెల్లించకపోయినా ఆ కార్యాలయాల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఫలితంగా రూ.10కోట్లకు పైగా బకాయిలు పేరుకుపోయాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా శాఖలకు ప్రతిఏడాది నిధులు కేటాయిస్తున్నా పన్ను చెల్లించకుండా కాలం వెళ్లదీస్తున్నాయి. ప్రతి ఏడాది ప్రభుత్వ శాఖలు సైతం మున్సిపాలిటీకి కచ్చితంగా ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆయాశాఖలకు ప్రభుత్వం నిధులను ఇస్తుంది. అయినప్పటికీ పన్ను చెల్లింపులో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వశాఖల నుంచి పన్ను ఎలా రాబట్టాలో తెలియక మున్సిపల్ అధికారులు తికమకపడుతున్నారు. మొత్తం రూ.11.28కోట్లకుగాను రూ.1.22కోట్ల పన్ను మాత్రమే వసూలైంది.

మున్సిపల్ రిపోర్ట్

**ప్రజావాణిలో వినతి..**

మున్సిపల్‌కు రావాల్సిన ఆస్తిపన్ను బకాయిల విషయంలో ఇటీవల మున్సిపల్ కమిషనర్ మంద మకరందు ఆయా శాఖల అధికారులకు స్వయంగా ప్రజావాణిలోనే విన్నవించారు. ఖచ్చితంగా ఆస్తిపన్ను బకాయిలు చెల్లించాలని కోరారు. ఏళ్ల తరబడిగా పెండింగ్‌లో ఉండడంతో మున్సిపల్ శాఖకు వచ్చే ఆదాయం కోల్పోతున్నామని తెలిపారు. ఈ విషయాన్ని పలు మార్లు ప్రజావాణిలో విన్నవించారు.

### వివిధ శాఖల బకాయిలు ఇలా..

- మున్సిపాలిటీకి ప్రభుత్వ శాఖల నుంచి రూ.10కోట్లు రావాల్సి ఉండగా, గత ఆరేళ్లకుగాను నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇప్పటి వరకు రూ.6,31,00 చెల్లించగా, రూ.5,46,32,558 కోట్లు చెల్లించాల్సి ఉంది.
- ప్రభుత్వ వైద్యకళాశాల ఆరేళ్లుగా పన్ను చెల్లించకపోవడంతో రూ.10,92,640 బకాయిలు పేరుకుపోయాయి. దీనిలో నుంచి కేవలం రూ.3,34,000 మాత్రమే చెల్లించారు. ప్రస్తుతం వడ్డీతో కలిపి రూ.7,47,640 బకాయిలు చెల్లించాల్సి ఉంది.
- జిల్లా పరిషత్, తపాలా, బీఎస్ఎన్ఎల్, రైల్వే వంటి శాఖలు 20 ఏళ్లుగా ఆస్తి పన్ను చెల్లించడం లేదు. రైల్వేశాఖ రూ.1,88,40,885, తపాలా శాఖ 15ఏళ్లకు సంబంధించి రూ.48,42,083 చెల్లించాల్సి ఉంది.

### చెత్తబుట్టలో నోటీసులు..

బకాయిలు చెల్లించాలని ప్రభుత్వశాఖలకు మున్సిపల్ అధికారులు ఇస్తున్న నోటీసులు చెత్తబుట్టలోకి చేరుతున్నాయి. నోటీసులు వస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం. బకాయిలు చెల్లించకుండా ఆయా శాఖల అధికారులు మున్సిపాలిటీని చిన్నచూపు చూస్తున్నారని సంబంధిత రెవెన్యూ అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

### 21 శాఖలు చెల్లించాలి..



నగర పరిధిలో సుమారుగా 65 ప్రభుత్వ శాఖలు ఉంటే 41శాఖలు ఆస్తి పన్ను బకాయిలు చెల్లిస్తున్నాయి. మిగిలిన 21శాఖలు చెల్లించడం లేదు. ప్రస్తుతం ఆయా శాఖలు రూ.10 కోట్ల పైనే పన్ను బకాయిలు ఉన్నాయి. బకాయిలు చెల్లించాలని సంబంధిత శాఖ అధికారులకు నోటీసులు కూడా ఇచ్చాం. –మంద మకరందు, మున్సిపల్ కమిషనర్, నిజామాబాద్

# బీసీల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘ నాయకులు

సుభాష్‌నగర్: బీసీల సంక్షేమానికి, అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఆయన స్వగృహంలో ఆదివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘ నాయకులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎనుగందుల మురళి, సంఘ సభ్యులు ఎమ్మెల్సీని సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్, కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సమగ్ర కుల గణన తీర్మానానికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని, కుల గణన ఆమోదం సంతోషకరమని, ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని ఆనందం వ్యక్తంచేశారు. కుల గణన పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం సకల ఏర్పాట్లు చేసిందన్నారు. అనంతరం సంఘం మహిళ అధ్యక్షురాలు స్వప్న ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని సన్మానించారు. సంఘ ప్రతినిధులు రేవంత్, ప్రవీణ్ కుమార్, కస్తూరి కృష్ణ పాల్గొన్నారు.

**ఎమ్మెల్సీని కలిసిన గౌడ సంఘ నాయకులు**

బోధన్: ఎమ్మెల్సీగా ఎన్నికైన పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్‌ను ఆదివారం నిజామాబాద్ నగర కేంద్రంలోని ఆయన స్వగృహంలో బోధన్‌కు చెందిన గౌడ సేవా సమితి డివిజన్ అధ్యక్షుడు పి. గంగాధర్ గౌడ్, పలువురు ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మహేష్ కుమార్ గౌడ్ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, గౌడ సామాజిక వర్గం రాజకీయంగా ఎదిగేలా ప్రొత్సహించాలని గౌడ సంఘం ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

### విద్యార్థులకు పండ్లు, వాటర్ బాటిళ్ల పంపిణీ



మోపాల్: డిచ్‌పల్లిలోని మానవతాసదన్ విద్యార్థులకు ఆదివారం బోర్గాం(పి)లోని యోగా కేంద్రం ఆధ్వర్యంలో స్టీల్ వాటర్ బాటిళ్లు, పండ్లు పంపిణీ చేశారు. సుమారు 120 మంది విద్యార్థులకు రూ.15వేల విలువైన బాటిళ్లు, పండ్లు అందజేసినట్లు కేంద్రం సభ్యులు తెలిపారు. సభ్యులు ప్రభాకర్, బంటు సంతోష్, రమేష్, ప్రకాశ్, గుత్ప గంగాధర్, జయ ప్రకాశ్, కిషన్ పాల్గొన్నారు.

### కానిస్టేబుల్‌గా ఎంపికైన హోంగార్డు



సిరికొండ: పోత్నూర్‌కు చెందిన గోపాల్ సిరికొండ పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తు కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. ఈసందర్భంగా ఆదివారం ఆయనను ఎస్సై రమేష్ అభినందించి, సన్మానించారు. సోమవారం నుంచి అంబారిపేట కేంద్రంలో శిక్షణ నిమిత్తం వెళుతుండటంతో ఆయనకు వీడ్కోలు పలికారు. ఏఎస్సై బాల్‌సింగ్, హెడ్ కానిస్టేబుళ్లు మధుకర్, జీవన్, కరుణ, కానిస్టేబుళ్లు నవీన్, శంకర్, దేవేందర్, హరీష్ పాల్గొన్నారు.

### జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ



సిరికొండ: జిల్లా స్థాయి అబాకస్, వేదిక్ మ్యాథ్స్ పోటీలలో సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు. విశ్వం ఎడ్యుటెక్ స్కూల్ లాబ్స్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పోటీలలో విద్యార్థులు శివాని, కార్తీక, అనన్య పాటిల్, సాధ్విలు అబాకస్ విభాగంలో చాంపియన్‌షిప్, వేదిక్ మ్యాథ్స్‌లో యశ్వంత్, వైశ్విక, నవ్యశ్రీలు చాంపియన్ షిప్ సాధించారు. శ్రీశాంత్, అవంతిక, నిత్యశ్రీ, హంజాల, సంకేత్, దీక్షితలు ప్రోత్సాహక బహుమతులు సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను డీఈవో దుర్గాప్రసాద్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు ప్రశంసాపత్రాలు అందచేసి అభినందించారు. సంస్థ ప్రతినిధులు మారుతి, వినాయక్, శివ, ఉపాధ్యాయులు గంగారెడ్డి, సతీష్, పూజిత్ పాల్గొన్నారు.

### గోమాతకు వైద్య చికిత్స



సుభాష్‌నగర్: నగరంలోని న్యాల్‌కల్ రోడ్‌లో ఆదివారం జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో గోమాత కాలికి గాయమైంది. వెంటనే స్థానికులు విశ్వహిందూ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి ధాత్రిక రమేష్‌కు సమాచారం అందించడంతో ఆయన స్పందించి, గోమాతను కోటగల్లిలోని వెటర్నరీ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు గోమాత కాలికి చికిత్స అందించారు. గోసేవకులు రాంప్రసాద్ చటర్జీ, హరీష్, సాకేత్, సాయి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం..

### నేటినుంచి ఎదురుకొండ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు





సిరికొండ: మండలంలోని తూంపల్లి శివారులో గల ఎదురు కొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా నేడు అగ్నిప్రతిష్ఠ, హోమం, బలిప్రదానం, 20న హోమం, డోలారోహణం, పల్లకీ సేవ, భజన, 21న శ్రీవారి కళ్యాణం, రథోత్సవం తదితర పూజలు నిర్వహించనున్నారు. అలాగే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### ఘనంగా రేణుక ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ ఆలయ 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. ఐదు రోజుల పాటు వేడుకలను నిర్వహించనున్నట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మేడిదా ల రవి గౌడ్, ప్రవీణ్ గౌడ్, సాగర్ గౌడ్, మాణిక్యం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# గురువులను పూజించాలి



బాల్కొండ: గురువులను పూజించాలని సత్యానంద మహర్షి ఆశ్రమాల పీఠాధిపతి శ్రీహరతి తీర్థ స్వామి అన్నారు. బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో మూడు రోజులుగా నిర్వహించిన గీతాశ్రమ వజ్రోత్సవ వేడుకలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెద్దలను గౌరవించడం, గురువులను పూజించడం సనాతన ధర్మం తెలుపుతుందన్నారు. ధర్మాన్ని ఆచరించడమే నిజ మైన భక్తి అన్నారు. గీతాశ్రమ వేడుకలను వైభవంగా నిర్వహించిన భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ప్రాంతాలకు చెందిన 60 మంది మఠాధిపతులు వజ్రోత్సవాల్లో పాల్గొన్నారు. చివరి రోజు భక్తులు గురు పాదపూజ నిర్వహించారు. గురువుల కాళ్లు కడిగి ఆశీర్వచనాలు తీసుకున్నారు.

## నేటి చిత్రం..



వీధి వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన షెడ్డులో నిలిపిన వాహనాలు

# ముస్తాబు చేసినా... వృథానే..

నగరంలోని హమాల్‌వాడి చౌరస్తాలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వీధివ్యాపారుల కోసం రేకులషెడ్డు నిర్మించారు. ఆకర్షణీయంగా ఉండటానికి వివిధ రకాల ముగ్గులతో, కూరగాయల బొమ్మలతో ముస్తాబు చేశారు. కానీ వాటిలో కూరగాయల వ్యాపారులు ఉండకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో పలువురు వాహనదారులు తమ వాహనాలను నిలపడంతో పార్కింగ్ షెడ్డుగా మారింది. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డుపైన అమ్మే వ్యాపారుల షెడ్డులోకి తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

# నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం



నగరంలో ప్రమాణస్వీకారం చేస్తున్న పద్మశాలి సంఘు ప్రతినిధులు

నిజామాబాద్‌నాగారం: నగరంలో ఆదివారం కోటగల్లి పద్మశాలి శాఖ సంధ్య సంఘం తర్ఫ 16 నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకా రం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు దీకొండ యాదగిరి హాజరై, మాట్లాడారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలుపుతూ, సంఘ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అధ్యక్షుడిగా అవదూత రాములు, ముఖ్య కార్యదర్శిగా సబ్బ ని రవి, కోశాధికారిగా బిల్ల లింబాద్రి, ఉపాధ్యక్షులుగా పెంటి దుర్గాదాస్, వాసం రవి, సూ రం రమేష్, సహాయ కార్యదర్శులుగా బొద్దుల రామకృష్ణ, వల్లకాటి ప్రణీత్, గంజి రాజు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పులగం హనుమండ్లు, పట్టణ కార్యదర్శి మురళి, సత్యపాల్, రవి, రాజు, ప్రసాద్, ఎల్లయ్య పాల్గొన్నారు.

# పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ నాయకులు

మాక్లూర్: ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మాణిక్‌భండార్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఒడ్డేట్‌పల్లిలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా పేదల పట్ల కనికరం చూపి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే నిజామాబాద్ నుంచి పెద్దపల్లికి వేసిన రైల్వే లైన్ వల్ల గ్రామంలో 10 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించాలన్నారు. సమావేశంలో శివరాజ్, కనకయ్య, సాయిలు, సుమన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 64,000 | వెండి (కిలో) | 75,600 |
| 22 క్యారెట్స్ | 59,015 | – నిజామాబాద్ బిజినెస్ | |

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు | డ్రెస్స్‌డ్ | 180 |
| | (కిలోకు) | లైవ్ | 160 |
| స్కిన్‌లెస్ | 220 | మటన్ | 800 |

### కూరగాయల ధరలు (రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 10 | 20 | గాజరుగడ్డ | 45 | 60 |
| బెండకాయ | 50 | 70 | పచ్చిమిర్చి | 40 | 70 |
| బీరకాయ | 60 | 80 | దోసకాయ | 20 | 40 |
| దొండకాయ | 30 | 50 | ఆలుగడ్డ | 16 | 30 |
| బీర్నిసుకాయ | 30 | 60 | గోబిగడ్డ | 20 | 40 |
| కాకరకాయ | 60 | 80 | గోబిపువ్వు | 20 | 40 |
| వంకాయ | 10 | 20 | బీట్‌రూట్ | 20 | 40 |
| పాలకూర | 20 | 40 | కరివేపాకు | 50 | 70 |
| మెంతికూర | 20 | 40 | చామగడ్డ | 60 | 80 |
| కొత్తిమీర | 15 | 30 | గోరుచిక్కుడు | 60 | 80 |
| పుదీనా | 25 | 50 | చిక్కుడుకాయ | 35 | 50 |
| క్యాప్సికం | 50 | 80 | | | |

– సుభాష్‌నగర్

### వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | ఊరు పేరు భైరవకోన (తెలుగు) – 1.40, 7.35, 10.30, హనుమాన్ (తెలుగు) 4.30 |
| స్క్రీన్-2 | ఈగల్ (తెలుగు) – 10.50, 10.30 మేడమ్ వెబ్ (ఇంగ్లిష్) – 1.50, ఓయ్ (తెలుగు) 4.10, 7.20 |
| స్క్రీన్-3 | ఈగల్ (తెలుగు) – 1.30, 4.30,7.30 హనుమాన్(తెలుగు) – 10.30 |

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

| | |
|---|---|
| స్క్రీన్-1 | మేడమ్ వెబ్ (ఇంగ్లిష్) – 12.20, తేరి బాతోమే (హిందీ) 3.00, ఓయ్ 6.10 ఊరు పేరు భైరవకోన (తెలుగు) 9.40 |
| స్క్రీన్-2 | ఈగల్ – 12.00, 10.00 హనుమాన్ (హిందీ) 3.20, 6.40 |
| స్క్రీన్-3 | రాజధాని ఫైల్స్ (తెలుగు) – 1.00 మేడమ్ వెబ్ (ఇంగ్లిష్) – 4.20, 10.05 |
| స్క్రీన్-4 | ప్రవీణ్ ఐపీఎస్ (తెలుగు) – 12.40, ఊరు పేరు భైరవకోన 4.20, మేడమ్ వెబ్ (ఇంగ్లిష్) 7.20 తేరి బాతోమే (హిందీ), 10.00 |
| దేవి | హనుమాన్ (తెలుగు) |
| నటరాజ్ | అంబాజీపేట మ్యారేజి బ్యాండ్(తెలుగు) |
| లలితామహల్ | ఈగల్ (తెలుగు) |
| విజయ్ | లాల్‌సలామ్(తెలుగు) 11.15, 6.15 యాత్ర-2 (తెలుగు) 2.15, 9.15 |